క్లుప్తంగా

వైభవంగా రావులమ్మ తీర్థం


రావులమ్మ

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి గ్రామ ఆడపడుచులు ముడుపులు, మొక్కులు, కానుకలు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఘనంగా జరిపారు.

గోదావరిలో నడచి వెళ్లవద్దు

కొత్తపేట/ఆలమూరు: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణ, తీర్థ మహోత్సవాలకు ఎవరూ గౌతమి గోదావరి నదిలో నడచి వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. నెల 7 నుంచి 13 వరకూ వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణం, తీర్థం జగురుతున్న విషయం తెలిసిందే. గతంలో వాడపల్లి–బడుగువాని లంక మధ్య గౌతమి గోదావరి నది దాటి వెళుతూ పలువురు గల్లంతై మృత్యువాత పడ్డారు. ఆ ఉదంతాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఆలమూరు, కడియం మండలాల నుంచి భక్తజనం బడుగువానిలంక, ఇతర లంక గ్రామాల మీదుగా ఎవరూ గోదావరిలో నుంచి నడచి వాడపల్లి వెళ్లవద్దని హెచ్చరించారు. ఆ మేరకు వివిధ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు దండోరా ద్వారా టాం టాం వేయించారు.

అన్న సమారాధనలు

అంబాజీపేట: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని మాచవరం శివారు పోతాయిలంక పెచ్చెట్టివారిపాలెంలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత సీతారామాలయంలో ఉన్న సీతారాముల వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే పీర్మాయిపాలెం, పుల్లేటికుర్రు, వాకలగరువు తదితర గ్రామాల్లో నవమి అన్నసంతర్పణలు భారీగా చేశారు.

గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై భారం


గన్నవరపు శ్రీనివాసరావు

మామిడికుదురు: గ్యాస్ ధరల పెంపుతో సామాన్యులపై మోయలేని భారం పడుతుందని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. దీని వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని పెంచిన ధరలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చెత్త సేకరణతోనే పరిసరాల పరిశుభ్రత

అయినవిల్లి: తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఇవ్వాలని నేదునూరు గ్రామస్తులకు డివిజనల్ పంచాయతీ అధికారి (డీపీవో) పి.బొజ్జిరాజు సూచించారు. నేదునూరు గ్రామంలో మంగళవారం డీపీవో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలన్నారు. ఇలా సేకరించిన చెత్తను షెడ్‌కు తరలిస్తారన్నారు. తడి చెత్తను వర్మీ కంపోస్టుగా తయారు చేసి పంటలకు ఎరువుగా ఉపయోగించేందుకు రైతులకు విక్రయిస్తారన్నారు. తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. అలాగే పొడి చెత్తను గ్రామానికి దూరంగా తీసుకువెళ్లి అంటిస్తామన్నారు. ఆయన వెంట స్థానిక ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహర, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎం.అన్వర్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రలు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడిబాట, బంగారుబాట

సఖినేటిపల్లి: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట, బంగారుబాట అనే కార్యక్రమాన్ని మోరి మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఎంఈఓ–1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి, భవితకు బంగారుబాట వేసుకోండి అంటూ ఇంటింటా ఉపాధ్యాయులు ప్రచారం చేపట్టారు. ఈ మేరకు పిల్లలను చేర్పిస్తూ ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు తగిన అడ్మిషన్ పత్రాలను వారు అందించారు. సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, హెచ్‌ఎం ఉండపల్లి వెంకట సత్యనారాయణ, టీచర్ యు.గిరిబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ సురేష్, అంగన్‌వాడీ టీచర్లు కొండా జ్యోతి, కొప్పినీడి శేషవేణి, విద్యాశాఖ స్టాఫ్ బళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణాంతకం

- ఆర్‌అండ్‌బీ రోడ్లపై పంచాయతీ పెత్తనం
- ఇష్టానుసారం తవ్వకాలు, పైప్‌లైన్ల ఏర్పాటు
- ప్రమాదకరంగా రోడ్ మార్జిన్‌లు


కేశనపల్లిలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు చేర్చి ఉన్న తాగునీటి పైప్ ఎయిర్ వాల్వ్


శంకరగుప్తం రోడ్డులో కేబుల్ లైన్ నిర్మాణం కారణంగా ధ్వంసమైన కొత్త బీటీ రోడ్డు

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మార్జిన్‌లు ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారుల ఉదాశీనతతో పాటు ప్రైవేటు వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల ఈ దుస్థితి నెలకొంది. ఫలితంగా ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటు, పంచాయతీరాజ్, సడక్, గ్రామీణ సీసీ రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామాల్లో రోడ్ల వెంబడి మార్జిన్లలో తాగునీటి పైప్ లైన్‌లు, వివిధ నెట్‌వర్క్ సంస్థల కేబుల్ వైర్ల కోసం ఇష్టానుసారం తవ్వకాలు సాగిస్తున్నారు. రోడ్ల వెంబడి ఉన్న ప్రైవేటు జిరాయితీ స్థలాల యజమానులు స్థలాలు ఇవ్వకపోవడంతో ఇరుకుగా ఉన్నా సరే రోడ్ల మార్జిన్లలోనే పైప్ లైన్లు, కేబుల్స్ వేస్తున్నారు. ఫలితంగా రోడ్ల మార్జిన్‌లు ప్రమాదకరంగా మారడంతో పాటు ఎంతో వ్యవ ప్రయాసల కోర్చి నిర్మాణం చేపట్టిన ప్రభుత్వం రోడ్లు కూడా శిథిలమవుతున్నాయి. రూ.కోట్ల ఖర్చుతో వేసిన రోడ్లు సైతం రోజుల సమయంలోనే ధ్వంసమవుతున్నాయి. రోడ్ల నిర్మించిన అధికారులు, కాంట్రాక్టర్లు నిర్వహణ మరచి అలా వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొంది. పైగా ఆయా పైప్ లైన్ల ఏర్పాటు సమయంలో ప్రైవేటు కేబుల్ ఆపరేటర్లు, వాటి కాంట్రాక్టు సంస్థలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులను కాకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులను అనుమతి అడుగుతున్నారు. అసలు పంచాయతీ అధికారులకు సంబంధం లేకపోయినా అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఇక్కడ ప్రైవేటు ఆపరేటర్లకు, కింది స్థాయి అధికారుల మధ్య లోపాయికారీ ఒప్పందంతో ఈ తంతు పూర్తవుతుంది. తమకు సంబంధం లేని పనులకు పంచాయతీలు కూడా అడ్డగోలు తీర్మానాలు ఇవ్వడం వల్ల ఈ వ్యవహారం మూడు గ్రామాలు... ఆరు పైప్ లైన్ల చందాను చీకట్లో సాగిపోతుంది. ఫలితంగా రోడ్లు ధ్వంసం కావడం, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాజోలు దీవితో పాటు అనేక గ్రామాల్లో ప్రతి ఆర్‌అండ్‌బీ రోడ్డు, పంచాయతీ రోడ్డులో ఈ దుస్థితి నెలకొంది. నెట్‌వర్క్ సంస్థల ఓఎఫ్‌సీ కేబుల్స్, తాగునీటి ప్రాజెక్టుల పైప్‌లైన్లు, వాటి ఎయిర్ వాల్వ్స్ కూడా ఇలానే ఇష్టానుసారం నిర్మాణం జరుగుతుంది. ప్రతి రోజూ ఏదో గ్రామంలో, ఏదో రోడ్డులో ఇలా కేబుల్ పనులు సాగుతున్నాయి. అసలే ఇక్కడ ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లు కనీసం ఏడు మీటర్ల వెడల్పు కూడా ఉండవు, దానికి మార్జిన్ రెండడుగులు కూడా ఉండదు. ఆ మార్జిన్‌లో తవ్విన గోతులు కూడా సదరు పైప్‌లైన్లు వేసే సంస్థలు పూడ్చరు. అందులోనే తాగునీటి పైప్ లైన్ల ఎయిర్ వాల్వ్స్ ఉంటాయి. అలా ఉన్న చోట్ల కనీసం ప్రమాద నివారణ సిగ్నల్స్ ఉండవు. ఇలాగే ప్రైవేటు భవనాలకు డ్రైన్స్, వాటర్ పనుల లైన్లు కూడా అధికారులు అనుమతి లేకుండా బలంగా ఉన్న రోడ్లను సైతం ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. ఇలా ధ్వంసమైన అయిన రోడ్లను చూసినా సంబంధిత అధికారులు చూసి ఎటువంటి చర్యలు ఉండవు. ఫలితంగా అనాదిగా యథేచ్ఛగా ధ్వంస రచన కొనసాగుతోంది.

ఆకట్టుకున్న చిన్నారుల కళా ప్రదర్శనలు


ర్యాలిలో శ్యామ్, డాక్టర్ మోహిత్‌కు మెమెంటో, చిన్నారులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఈఓ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అను సకల కళల ఉచిత శిక్షణ కేంద్రం చిన్నారులు చేసిన కళా నీరాజనం విశేషంగా ఆకట్టుకుంది. కేంద్రం నిర్వాహకుడు చింతా శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు డ్యాన్స్, మ్యాజిక్‌తో పాటు వివిధ వాయిద్యాలతో కేశవ స్వామికి కళా నీరాజనాన్ని అర్పించారు. అనంతరం దేవస్థానం ఈవో భాగవతుల వెంకట రమణమూర్తి–నాగమణి దంపతులు శ్యామ్ కుటుంబ సభ్యులను అభినందించి మెమెంటో అందజేశారు. ప్రతిభ చూపిన చిన్నారులను కండువాలతో సత్కరించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీను, దత్తు, సునీత, డాక్టర్ మోహిత్, సీత, అన్నపూర్ణ, గడ్డం వెంకట్రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూకాలమ్మ తీర్థం

నెల రోజుల పాటు ఉత్సవాలు


గూడపల్లిలో వేంచేసిన నూకాలమ్మ వారు

మలికిపురం: రాజోలు దీవిలో సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఉత్సాహంగా, ఆహ్లాదకర వాతావరణంలో సాగుతున్నాయి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఉగాదికి ప్రారంభమైన ఉత్సవాలు, వచ్చే 27వ తేదీ వరకూ జరుగుతాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహిమ గల దేవతగా విరాజిల్లుతున్న అమ్మవారికి నెల రోజుల పాటు జరిగే తీర్థంలో భాగంగా తొలి 15 రోజులు వివిధ వంశస్తులతో అమ్మవారికి ప్రతి రోజూ సేవలు నిర్వహిస్తారు. తొలి రోజు ఉగాదికి సాగి వంశస్తుల సేవ జరిగింది.. రెండో రోజు ఉద్దరాజు, గొట్టుముక్కల వంశస్తులు, మూడో రోజు కటికిరెడ్డి పెద గద్దయ్య కుటుంబీకులు, నాలుగో రోజు కటికిరెడ్డి చిన గద్దయ్య కుటుంబీకులు, ఐదో రోజు దూది బండబ్బాయి వారసులు, ఆరో రోజు సుందర కుటుంబీకులు, ఏడో రోజు విజ్జిన కుటుంబీకులు, ఎనిమిదో రోజు కొప్పిడి కుటుంబీకులు, తొమ్మిదో రోజు పలచోళ్ల కుటుంబీకులు, పదో రోజు తలమోరు శెట్టి బలిజలు, పదకొండో రోజు మలికిపల్లి అడబాల కుటుంబీకులు, పన్నెండో రోజు గూడపల్లి వారు, పదమూడో రోజు పాగరు కుటుంబీకులు, పద్నాలుగో రోజు గుబ్బల కుటుంబీకులతో అమ్మవారికి ఘనంగా సేవలు జరిగాయి. అనంతరం వచ్చే పౌర్ణమికి అమ్మవారికి రథోత్సవం, మిరుమిట్లు గొలిపే విద్యుదీకరణలతో వైభవంగా జరుగుతుంది. ఏటా వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. సుమారు 200 ఏళ్ల క్రితం గూడపల్లి పొలిమేరలో తూర్పు దిశగా వెలసిన మొగళ్లమ్మ అమ్మవారు కాలక్రమేణా నూకాలమ్మ అమ్మవారిగా ప్రసిద్ధి చెందారని స్థానికులు అంటున్నారు. ఈ ఆలయానికి 1900లో గ్రామానికి చెందిన కటికిరెడ్డి గద్దయ్య, సాగి కుటుంబాలకు చెందిన సోదరులు ఆలయం నిర్మించి కొంత భూమి కూడా ఇచ్చారని స్థానికులు అంటున్నారు. ఆ కాలం నుంచీ కటికిరెడ్డి కుటుంబీకులు అత్తనిల్లుగానూ, సాగి కుటుంబీకులు పుట్టినిల్లుగా అమ్మవారికి ఏటా ఉత్సవాలు జరుగుతున్నాయని పెద్దలు చెప్పారు. ప్రస్తుతం దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయంలో పూర్వ ఆచార వ్యవహారాలనే అనుసరించి అన్ని పూజలూ జరుగుతున్నాయి.

గూడపల్లి తీర్థం ఇత్తడి సామాన్లకు ప్రసిద్ధి

చరిత్ర, సాంస్కృతిక, ప్రజల ఆనాటి జీవన వస్తు కొనుగోలు తదితర జీవన విధానాలకు ఆనవాలుగా ఈ తీర్థం నిలిచింది. అనేక ఏళ్ల చరిత్ర కలిగిన నూకాలమ్మ తీర్థ మహోత్సవాల్లో వేసే దుకాణాల్లో ప్రధానంగా ఆకట్టుకునేవి ఇత్తడి సామాన్ల దుకాణాలు. ఆ రోజుల్లో వివిధ వస్తువులు, కొనాలంటే తీర్థాలే ప్రధానాధారం. సుమారు నెల రోజుల పాటు ఇక్కడ దుకాణాలు ఉంటాయి. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన తయారీ సంస్థల నుంచి ఇక్కడికి ఇత్తడి సామాన్లు ఇక్కడికి వచ్చేవి. పెళ్లిళ్ల సమయంలోనూ ఇతర అవసరాలకు ఇత్తడి సామాన్లను అధికంగా వాడుతారు. అటువంటి ప్రాధాన్యం కలిగిన ఇత్తడి సామాన్లను గూడపల్లి తీర్థ మహోత్సవాల సమయంలోనే ఈ ప్రాంత ప్రజలు అధికంగా కొనుగోలు చేసే వారని స్థానికులు చెబుతున్నారు. అయితే మారిన కాలాలకు అనుగుణంగా ప్రస్తుతం ప్రధాన కూడళ్లు రావడంతో స్థిరమైన దుకాణాలు రావడం వల్ల ఈ తీర్థంలో కూడా ఇత్తడి దుకాణాలు తగ్గాయి.

శాశ్వత పనులతో సమాజానికి మేలు


సఖినేటిపల్లి పాలెం సెంటర్లో సురక్షిత మంచినీటి పథకం ప్రారంభిస్తున్న పద్మరాజు, చైతన్యరాజు

సఖినేటిపల్లి: సేవా దృక్పథంతో శాశ్వత ప్రయోజనం చేకూర్చే పనులు సమాజానికి అందించడం ద్వారా తరతరాలు వారికి ఎంతో మేలు చేకూరుతుందని మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, అమలాపురం కిమ్స్, మెడ్ యునైటెడ్ సంస్థల ఫౌండర్ కేవీవీ సత్యనారాయణ రాజు అన్నారు. మంగళవారం సఖినేటిపల్లి పాలెం సెంటర్లో ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఇంక్ అమెరికా, ఫౌండర్ డాక్టర్ భూపతిరాజు సహకారంతో, ఫౌండేషన్ నియోజకవర్గ కన్వీనర్ జంపన బుజ్జిరాజు నిర్వహణలో స్థానిక ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దంతులూరి శ్రీనివాసరాజు పర్యవేక్షణలో నెలకొల్పిన సురక్షిత మంచినీటి పథకం, అధునాతన ఆర్వో నీటి శుద్ధి ప్లాంట్ (దత్తత గ్రామం సఖినేటిపల్లి)ను మాజీ ఎమ్మెల్సీ పద్మరాజు, చైతన్యరాజు ప్రారంభించారు. ప్రజలకు రూ.5 కే 20 లీటర్ల రక్షిత తాగునీరు సరఫరా అయ్యేలా ఏర్పాటు చేశారు. అలాగే అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కిమ్స్, మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కూడా వారు ప్రారంభించారు. శిబిరంలో గుండె వ్యాధులు, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ విభాగాల్లో సుమారు 400 మంది రోగులకు 42 మంది వైద్య సిబ్బంది సేవలు అందించారు. ఈ మేరకు బుజ్జిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పద్మరాజు, చైతన్యరాజు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీటీసీలు కట్టా వెంకాయమ్మ, రుద్రరాజు చినరాజా, డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, రావి ధర్మరాజు, అటారం మాష్టారు, ఆరిపల్లి సత్యనారాయణ, సరెళ్ళ విజయ్ ప్రసాద్, అయినవిల్లి సత్యనారాయణ, నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

మామిడికుదురు: కాపు, బీసీ, ఈడబ్ల్యూఎస్, జనరిక్ మందుల షాపుతో సహా 102 మంది లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మంగళవారం రెండో రోజు కూడా ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకర్లు దరఖాస్తుదారులతో ముఖాముఖీ మాట్లాడారు. మొత్తం 1819 మంది దరఖాస్తు చేశారు. మండలాన్ని నాలుగు యూనిట్లుగా విభజించారు. రెండు రోజులు నాలుగు సెషన్లలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు భారీగా దరఖాస్తుదారులు రావడంతో మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం కిటకిటలాడింది. కాపు కార్పొరేషన్ ద్వారా 43 మందికి, బీసీ కార్పొరేషన్ ద్వారా 53 మందికి, ఈడబ్ల్యూఎస్ ద్వారా ఆయిదుగురికి, ఒకరికి జనరిక్ మెడిక్ షాపుకు సబ్సిడీ రుణం మంజూరు చేయనున్నారు. మండలంలో 18 గ్రామాలు ఉండగా మేజర్ గ్రామానికి రెండు లేదా మూడు, మైనర్ విలేజ్‌కు ఒకటి యూనిట్ మాత్రమే మంజూరు చేస్తున్నారు. దీనిపై దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదంతా ఒక ప్రహసనంగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా పారిశుధ్య చర్యలు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రజారోగ్యమే లక్ష్యంగా గ్రామ పంచాయతీలు సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం మంగళవారం మధ్యాహ్నం ఎంపీపీ గంగాధరారవు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, సభ్యులు, సర్పంచ్‌లు తేవనెత్తిన పలు సమస్యలపై సమీక్షించారు. పలివెలలో అపారిశుధ్యం రాజ్యమేలుతుందని, ఇంటింటా చెత్త సేకరణకు గతంలో 6 తొట్టి రిక్షాలు ఇస్తే వాటిని వాడటం లేదని, పారిశుధ్య కార్మికులను తొలగించారని, ఖర్చు మాత్రం రాస్తున్నారని ఎంపీపీ గంగాధరరావు ప్రస్తావించారు. ఈ పంచాయతీయే అలా ఉందా? మిగిలిన పంచాయతీలు కూడా అలాగే ఉన్నాయా? అని ఈఓపీఆర్డీని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అదనపు నిధులు ఇస్తే గ్రీన్ అంబాసిడర్ల ద్వారా అవి సక్సెస్ అవుతాయని బిళ్లకుర్రు, వాడపాలెం సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, త్సామా బాబు అన్నారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనులకు మండల పరిషత్ తీర్మానం చేయాలని, అయితే ఆయా పనులు నిర్మాణం చేపట్టినప్పుడు గాని, పూర్తయ్యాక ప్రారంభించినప్పుడు గాని కనీసం ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వరేమని ఎంపీపీ మార్గన సంబంధిత అధికారిని నిలదీశారు. వివిధ కారణాలతో ఉపాధి పనులకు హాజరు కాని కూలీల నుంచి పలువురు ఫీల్డ్ అసిస్టెంట్స్ మస్టర్ వేయించుకుని ఆ నాగా డబ్బులు వారే తీసుకుంటున్నారని, ఇవ్వకపోతే హాజరు కాలేదని జాబ్ కార్డు రద్దు చేస్తారని బెదిరిస్తున్నారని ఎంపీటీసీ సభ్యురాలు పల్లి శాంతి సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ నరేష్‌కుమార్, ఏపీఓ ఆనంద్ హామీ ఇచ్చారు. ప్రస్తుత వేసవిలో అన్ని గ్రామాల్లో తాగు నీరు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆ అధికారికి సూచించారు. మంజూరైన డ్రైన్స్ ఆధునీకరణ పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గంటి–పల్లిపాలెం ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు మసిపూసి మారేడుకాయ చందాన వేశారని ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు ప్రస్తావించారు. పీఆర్ ద్వారా రింగ్ రోడ్డలో వేసిన సీసీ రోడ్డు ఏదో ఒక పక్క నుంచి పూర్తి చేయకుండా ఇరు వైపులా వేసి మధ్యలో కొంతమేర వదిలేశారని, ఇదేమి విధానమని ప్రశ్నించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుంటున్నా పట్టించుకోని హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ విళ్ల రాజబాబు డిమాండ్ చేశారు. సమావేశంలో తహసీల్దార్ వై.రాంబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలి

అంబాజీపేట: ప్రతి విద్యార్థి తన గ్రూప్ సబ్జెక్టులపై ప్రణాళికా బద్ధంగాను, ఒత్తిడికి గురికాకుండా చదువుకోవడం వల్ల మంచి మార్కులు సాధిస్తారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను హెచ్‌ఎం కడలి సాయి రామ్ అధ్యక్షతన మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పే సబ్జెక్టులను శ్రద్ధగా వినడంతో పాటు వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కష్టపడి ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, కొర్లపాటి రాజగోపాలరావు, సుంకర పేరయ్యానాయుడు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల సుబ్బారావు, వలవల బాబి, వీరా సతీష్ పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థినులకు మంగళవారం పాఠ్య పుస్తకాల పంపిణీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ఈ ఉచిత పాఠ్య పుస్తకాలను ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ ర్యాలి సుబ్బలక్ష్మి అందజేశారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు వి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనేటి రాయుడి దివ్యక్షేత్రానికి పోటెత్తిన భక్తులు

- వైభవంగా వెంకన్న రథోత్సవం, తీర్థం
- స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాలు


తిరుచ్చి వాహనంపై వేంకటేశ్వరస్వామి


లంకల గన్నవరంలో వేంకటేశ్వరస్వామి

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు మంగళవారం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. ఏటా జరిగే తీర్థ కల్యాణోత్సవాలకు దేవదాయ శాఖ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు పర్యవేక్షణలో దేవస్థానం డీసీ అండ్ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ కల్యాణోత్సవ ఏర్పాట్లు చేశారు. తిరుమల ఆలయం మాదిరిగానే వాడపల్లిలో ఆలయాన్ని ప్రత్యేక పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారిని ఉదయం తీర్థ బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం, సుప్రభాతసేవ, బాలభోగం, నివేదన, నీరాజన మంత్రపుష్పం, స్వామివారి దర్శన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మి అమ్మవారికి ఎదురుకోలు మండపం వద్ద సన్నాహాలు, బలిహరణ, హోమం, కల్యాణ కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తీర్థం, రథోత్సవం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శక్తి వేషాలు, కోలాటం, వివిధ నృత్య సంగీత, వాయిద్య ప్రదర్శనలు ప్రజలను అలరించాయి. అమరవీరుల స్థూపం వద్ద అమవీరులకు నివాళలర్పించారు. కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తులకు పలు గ్రామాల్లో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు దారి పొడవునా మజ్జిగ, పులిహోర, పాలు, నీరు, అన్నదానం నిర్వహించారు.

భారీ పోలీసు బందోబస్తు

కల్యాణోత్సవాల్లో ఎటువంటి చోరీలు జరగకుండా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఎస్పీ కృష్ణారావు పర్యవేక్షణలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం అధికారులు ఆధ్వర్యంలో ప్రైవేట్ బందోబస్తు సిబ్బందిని నియమించారు. రావులపాలెం ఆర్టీసీ డిపో ద్వారా రావులపాలెం నుంచి వాడపల్లి 5 బస్సులు, వాడపల్లి నుంచి రాజమహేంద్రవరం 5 బస్సులు, ప్రతీ 20 నిమిషాలకు ప్రత్యేక బస్సులు నడిపారు. అలాగే రాజమహేంద్రవరం డిపో నుంచి 5 బస్సులు నడిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణాలు

పి.గన్నవరం: లంకల గన్నవరంలో కొలువుదీరిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తీర్థం వైభవంగా జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు ఖండవిల్లి నారాయణాచార్యులు, మారుతి ఆచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును అంగరంగ వైభవంగా జరిపించారు. దీనిలో భాగంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

అంబాజీపేట: ఇరుసుమండలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వెంకన్న కల్యాణం సందర్భంగా గోవింద నామాలతో ఆ ప్రాంతమంతా పులకించిపోయింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అయినవిల్లి: మండలంలోని ఎన్.పెదపాలెంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిపారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే మండలంలోని నల్లచెరువులో వేంచేసినపద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అష్టమ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

రావులపాలెం: ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రాజబాబు అన్నారు. రావులపాలెంలోని కరూర్ వైశ్యా బ్యాంకు సమీపంలో కర్రి తాతారెడ్డి కాంప్లెక్స్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన కేవీఎల్ సోలార్ ఎనర్జీ కార్యాలయాన్ని మంగళవారం రాజబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో గృహ విద్యుత్ వినియోగంలో ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు రూ.78 వేలు రాయితీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండరాముని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో ఉపాలయంలో కొలువైన కోదండరామ స్వామివారి పాంచహ్నిక కల్యాణం మంగళవారం శ్రీరామనవమి పురస్కరించుకుని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యుల పర్యవేక్షణలో అర్చకులు నిర్వహించారు. అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ వంటి విశేష కార్యక్రమాలు చేశారు. అనంతరం హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, దేవస్థానం స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్ అధ్యక్షతన వహించగా జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు ప్రమోషన్‌పై వచ్చిన సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగేశ్వరరావు, సిబ్బంది రామారావు, జయలక్ష్మి, ట్యాబ్ టెక్నీషియన్ నరేష్‌బాబు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై దర్యాప్తు చేయించాలి

అంబాజీపేట: పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం మిస్టరీ కాకూడదని, న్యాయమైన దర్యాప్తు చేయించాలని మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ ధనరాజ్ చికిలే అన్నారు. అంబాజీపేట బెరాక మందిరంలో ఏయూపీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్ కరుణాకర్ అధ్యక్షతన పాస్టర్ ప్రవీన్ జ్ఞాపకార్థ కూడిక మంగళవారం నిర్వహించారు. ధనరాజ్ మాట్లాడుతూ ప్రవీణ్‌ది హత్య, లేక ప్రమాదమా అనేది దర్యాప్తు చేసి ఆయన కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.